ఈక్వెస్ట్రియన్ లీగ్‌లో గోల్కొండ చార్జర్స్‌కు మూడో స్థానం



సాక్షి, సిటీబ్యూరో: హార్స్ రైడింగ్ నైపుణ్యానికి చిరునామాగా నిలిచే ఈక్వెస్ట్రియన్‌ను ప్రోత్స హించేందుకు ఈక్వెస్ట్రియన్ చాంపియన్స్ లీగ్‌ను తీసుకొచ్చారు. ఐపీఎల్ తరహాలో ఫ్రాంచైజీల మధ్య జరిగే ఈ పోటీలు కోయంబత్తూరులో విజయవంతంగా ముగిశాయి. ఈక్వెన్ స్పోర్ట్స్ ఇండియా ఫెడరేషన్, ఇండిజీనస్ హార్స్ సొసైటీ కలిసి ఈ పోటీలను నిర్వహించాయి. ఈ ఈక్వెస్ట్రియన్ చాంపియన్స్ లీగ్‌లో తెలంగాణ నుంచి గోల్కొండ చార్జర్స్ సత్తా చాటింది. పోటీల ఆరంభం నుంచీ మంచి ప్రదర్శన కనబరిచిన గోల్కొండ ఛార్జర్స్ ఈ సీజన్‌లో మూడో స్థానం సాధించింది. కొంతకాలంగా ఈక్వెస్ట్రియన్‌లో అద్భుతంగా రాణిస్తున్న రైడర్లు శివకుమార్, అమాన్ అలీ, యువాన్ ప్రతీక్ , నితిన్, అదాతి, అహిల్ గోల్కొండ ఛార్జర్స్ జట్టుకు ప్రాతినిధ్యం వహించారు. చెన్నై బుల్స్ 109 పాయింట్లతో టాప్ ప్లేస్ లో నిలవగా..పెగాసస్ స్పోర్ట్స్ 97 పాయింట్లతో రెండో స్థానంలోనూ, గోల్కొండ ఛార్జర్స్ 73 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచాయి. మూడో ప్లేస్‌లో నిలిచిన గోల్కొండ చార్జర్స్‌కు రూ.5 లక్షల ప్రైజ్ మనీ దక్కింది.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు



మైలార్‌దేవ్‌పల్లి: రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ గాయపడింది. వివరాలిలా ఉన్నాయి. కాటేదాన్ పారిశ్రామిక వాడలోని ఓ కంపెనీలో బాబుల్‌రెడ్డినగర్‌లో ఉంటున్న పూనం పని చేస్తుంది. గురువారం ఆమె రోడ్డు దాటుతున్న సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడింది. స్థానికుల సమాచారంతో 108 సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని ఆసుపత్రికి తరలించారు. పూనం మోచేతి కింది భాగం, కాలి పిక్క భాగంలో కొంతమేర చర్మం ఊడిపోయింది.

చెరువులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

గచ్చిబౌలి: చెరువులో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైన సంఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఏఎస్ఐ శంకర్ తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గచ్చిబౌలిలోని ఇండియన్ ఇమ్యూనోలాజికల్ లిమిటెడ్‌లోని పోచమ్మ కుంటలో గుర్తు తెలియని వ్యక్తి (30- 40) మృతదేహం తేలియాడుతోందని గురువారం ఉదయం 8.30 గంటలకు సెక్యూరిటీ ఇంచార్జీ జి.సురేష్ గచ్చిబౌలి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి ఎడమ చేతిపై డాడీ, డ్రాగన్, కుడి చేతిపై ఆర్, ఎస్‌కె తో పాటు ఫ్యామిలీ బొమ్మ పచ్చబొట్లు ఉన్నాయి. మూడు రోజుల క్రితమే చనిపోయి ఉంటాడని పోలీసులు తెలిపారు. సంబంధిత వ్యక్తులు ఉంటే గచ్చిబౌలి పీఎస్‌లో, 9490617127 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్లు ఇలా.. ప్రయాణం సాగేదెలా..?

- మణికొండ మున్సిపాలిటీలో అధ్వానంగా రోడ్లు
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



ప్రశాంతి నగర్ కాలనీలో అధ్వానంగా రోడ్డు



గుంతలమయంగా తుల్జారాం ఆలయం వెనక రోడ్డు

మణికొండ: అభివృద్ధి అనేది ఓ గ్రామం, మున్సిపాలిటీ, కాలనీల్లో రోడ్లను చూసి ఎవరైనా చెపుతారు. ఆదాయం అంతగా లేని మున్సిపాలిటీల్లో నిధుల లభ్యతను బట్టి చేస్తారు లే అనుకుంటారు. కోట్లాది రూపాయల ఆదాయం ఉన్న మణికొండ లాంటి మున్సిపాలిటీలో అధిక ప్రాధాన్యత రోడ్లకు ఇచ్చి వాటిని బాగు చేసుకోవాలి. కానీ అందుకు భిన్నంగా అనేక రోడ్లు గుంతల మయంగా మారాయి. దీంతో ప్రయాణికులు నిత్యం అయితే గోతులు, లేదంటే స్పీడ్ బ్రేకర్లతో గెంతుతూ ప్రయాణించాల్సి వస్తుందని పలువురు వాపోతున్నారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని అనేక రోడ్లల్లో గోతులు ఏర్పడడం, వాటిని తప్పించుకునే ప్రయత్నంలో ప్రమాదాలు జరిగి అనేక మంది గాయాల పాలవుతున్నారు. అదే వర్షాలు కురిస్తే ఆ గోతులు కనిపించక మరెంత మంది ప్రమాదాల బారిన పడతారని వారు పేర్కొంటున్నారు. కొన్ని కాలనీల్లో నీటి ట్యాంకర్లు, రెడీమిక్స్ వాహనాలు వందలాదిగా తిరగడం, రోడ్లపై నీరు పడి అవి పాడై పోయి గుంతల మయంగా మారుతున్నాయని



రెడీమిక్స్ వాహనాలు తిరిగి ధ్వంసమైన రోడ్డు

వారు వాపోతున్నారు. అలాంటి వాటిని కట్టడి చేయలేక, ఇటు రోడ్లపై ఏర్పడిన గోతులను సకాలంలో మూయకపోవటంతో తాము ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణిస్తున్నామని అనేక మంది ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గోతుల మయంగా..

మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని అలకాపూర్ టౌన్‌షిప్, తుల్జారాం ఆలయం పక్క నుంచి నార్సింగి మున్సిపాలిటీ కేంద్రానికి వెళ్లే పలు రోడ్లు పూర్తి స్థాయిలో గోతుల మయంగా తయారయ్యాయని అటుగా ప్రయాణించే వారు తెలిపారు. స్కూల్‌లకు వెళ్లి వచ్చే విద్యార్థులు, వారిని తీసుకుని వచ్చే తల్లిదండ్రులు అనేక సార్లు ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. ఇకనైనా మున్సిపల్ అధికారులు స్పందించి వాటిని వెంటనే మరమ్మతులు చేసి ప్రమాదాలను నివారించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

'మై ఆటో ఈజ్ సేఫ్ యాప్'లో నమోదు చేసుకోవాలి



ఆటోలకు స్టిక్కర్లు ఏర్పాటు చేసే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఏసీపీ బాలాజీ

అత్తాపూర్: రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో తిరుగుతున్న ఆటో డ్రైవర్లు తమ ఆటోల ఆర్‌సీ, లైసెన్స్, ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీలు తీసుకొని వచ్చి మై ఆటో ఈజ్ సేఫ్ ఆప్‌లో మోటార్ వాహనాల చట్టం రూల్ 267, 270 ప్రకారం నమోదు చేసుకోవాలని ఏసీపీ ఏ.బాలాజీ సూచించారు. గురువారం రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఏసీపీ బాలాజీ, ప్రారంభించారు. నమోదు చేసుకున్న ఆటోలో ప్రయాణించే మహిళలు, వృద్ధులు, చిన్నారులకు పూర్తి భద్రత ఉంటుందన్నారు. నమోదు చేసుకున్న ఆటో ఎవరైనా చోరీ చేసినా, చోరీ చేసిన ఆటో ఎక్కడ ఉంది ఆటోపై అతికించిన స్టికర్ ద్వారా పోలీసులు గుర్తించి ఆటో ఓనర్‌కు అప్పగిస్తారన్నారు. రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో తిరిగే ఆటో డ్రైవర్లు కచ్చితంగా తమ ఆటోలను ఈ యాప్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ రాజు, చేవెళ్ల ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎస్.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్రా యాత్రికులకు ఘన స్వాగతం



శంషాబాద్: మొహర్రం నెల ప్రారంభం తర్వాత ఉమ్రాను సందర్శించుకున్న మరో బృందం యాత్రను దిగ్విజయంగా పూర్తి చేసుకుని హైదరాబాద్‌కు చేరుకుంది. యాత్రికులకు గురువారం శంషాబాద్ విమానాశ్రయంలో వారి కుటుంబ సభ్యులు, స్నేహితులు పూలమాలలతో సత్కరించి స్వాగతం పలికారు. యాత్రను అల్‌మిజాన్ సంస్థ నిర్వాహకులు ఫయాజ్ అలీ పర్యవేక్షించారు.



పూర్వ విద్యార్థుల సమ్మేళనం

మణికొండ: వారంతా 35 ఏళ్ల క్రితం కలిసి ఒకే పాఠశాలలో చదువుకున్నారు. గురుపౌర్ణమి సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సత్కరించి వారి ఆశీర్వాదాలు తీసుకోవాలని నిర్ణయించి ప్రణాళికను రచించారు. తమ పూర్వ విద్యార్థుల సమాచారాన్ని సేకరించి వారిని కార్యక్రమానికి పిలిచి రోజంతా సందడిగా గడిపారు. నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1988–89 విద్యా సంవత్సరంలో 150 మంది కలిసి చదువుకున్నారు. వారంతా స్థానిక కేవీఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారి ఉపాధ్యాయులు ముకుందరెడ్డి, సత్యనారాయణరెడ్డి, సీతాబాయిలను ఘనంగా సన్మానించి వారి ఆశీర్వచనలు తీసుకున్నారు.

నీటి వృథాను అరికట్టండి



నీటి వృథాను పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మణికొండ: గండిపేట నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న తాగునీరు అనేక చోట్ల క్యాండూట్‌కు లీకేజీలు ఏర్పడి లక్షల లీటర్ల నీరు వృథాగా పోతుందని, దాన్ని వెంటనే అరికట్టాలని మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ ఉపాధ్యక్షుడు లక్ష్మణ్‌రావు డిమాండ్ చేశారు. గురువారం వారు సెక్రటేరియట్ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలో ఉన్న ఫిల్టర్ బెడ్ వద్ద నీరు వృథాగా పోతుందన్నారు. ప్రజలకు సరిపడ నీటిని సరఫరా చేయలేని అధికారులు ఇలా నీరు వృథాగా పోతున్నా పట్టించుకోకపోవడం వారి పనితీరుకు అద్దం పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మహిళా అధ్యక్షురాలు రూపారెడ్డి, నాయకులు రాజేంద్రప్రసాద్, శ్రీకాంత్, లక్ష్మయ్య, నర్సింగ్‌రావు, మంజుల, అనూష, రాజు, సుమనళిని, బాలాజీ, కిరణ్ పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలి



ఎన్నికల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

బండ్లగూడ: విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని నారాయణ సీబీఎస్ఈ స్కూల్ ప్రిన్సిపాల్ జి.సురేష్ అన్నారు. గురువారం కిస్మత్‌పూర్‌లోని పాఠశాలలో స్టూడెంట్ అకాడమిక్ యాక్టివిటీలో భాగంగా స్కూల్ కౌన్సిల్ ఎన్నికలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై కెప్టెన్, వైస్ కెప్టెన్ విద్యార్థుల మద్దతుతో ఎన్నికలు నిర్వహించి ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్ నగర్ జోన్ ఏజీఎం శ్రీనివాస్‌రెడ్డి, కోఆర్డినేటర్ జ్యోతిరావు, అకాడమిక్ డీన్ తులసీ, ఏవో మనోజ్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి



పనులు పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

మైలార్‌దేవ్‌పల్లి: మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని ఆప్కో కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నాణ్యత పాటిస్తూ ఎటువంటి లోపాలు లేకుండా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ నర్సింహమూర్తి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాహుల్, బుచ్చిరెడ్డి, ఎల్.వి.రెడ్డి, సురేష్, నరేష్‌యాదవ్, మన్మోహన్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, సతీష్, శంకర్, నారాయణ, శాంతమ్మ, పారిజాతం, లక్ష్మీ, జాషువా పాల్గొన్నారు.

భక్తులకు అసౌకర్యం కలగకుండా చూడాలి



డీసీకి వినతిపత్రం అందజేస్తున్న వెంకటేష్

మైలార్‌దేవ్‌పల్లి: బోనాలను పురస్కరించుకొని భక్తులకు అసౌకర్యం కలగకుండా చూడాలని మైలార్‌దేవ్‌పల్లి బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఎస్.వెంకటేష్ అన్నారు. గురువారం రాజేంద్రనగర్ సర్కిల్ ఉపకమిషనర్ రవికుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..డివిజన్ పరిధిలోని పలు ఆలయాల వద్ద రోడ్లు గుంతమయంగా మారాయన్నారు. వీటికి ప్యాచ్‌వర్క్‌లు చేస్తే ఆలయానికి వచ్చే భక్తులకు సమస్యలు ఉండవన్నారు. సాయిబాబానగర్ ఇందిరాగాంధీ విగ్రహం నుంచి శివరాంపల్లి రైల్వే గేటు వరకు ఉన్న 100 ఫీట్ల రోడ్డును 30 ఫీట్లకు కుదించి రోడ్లను ఆక్రమించి ఉన్న వాణిజ్య వ్యవస్థను తొలగించాలని దారిని పునరుద్ధరించాలన్నారు. యూత్ అధ్యక్షుడు రాఘవేందర్‌యాదవ్, భూదేవి, సూర్యం, జగదీష్, సురేష్‌ముదిరాజ్, సునీల్, శంకర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఆలయ వార్షికోత్సవాలు



చక్రతీర్థంలో పాల్గొన్న భక్తులు

మణికొండ: సీతారామచంద్ర అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవాలు గురువారంతో ముగిశాయి. ఉదయం సుప్రభాత సేవ, నిత్యారాదన, సేవాకాలం, శాత్తుమొరై, శాంతిపాఠం, వేద విన్నపాలు, ద్వారతోరణ, బలి, మహాపూర్ణాహుతి, అవబృథ స్నానం, చక్రతీర్థం పూజలను నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున అన్న ప్రసాద వితరణ చేపట్టారు. సాయంత్రం విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, పుష్పయాగం, ద్వాదశ ఆరాధన, సప్తావరణ, దేవతోద్వాసనం, ధ్వజ అవరోహణ, నివేదన, ఆలయ కమిటీ చైర్మన్ వి.నాగరాజకు మహాదాశీర్వచనం చేశారు. అనంతరం వార్షిక పూజలు నిర్వహించిన గోవర్ధనం బట్టరాచార్యస్వామి, గోవర్ధన రాఘవాచార్యస్వామికి ఆలయం తరఫున చైర్మన్, భక్తులు సన్మానించి ఉత్సవాలను సమాప్తం చేశారు.

ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు



మణికొండ భాగ్యలక్ష్మి కాలనీ ఉమా కాశీనాథుని ఆలయంలో..



కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వ విద్యాలయంలో గురువును సన్మానిస్తున్న విద్యార్థులు



యోగా గురువు ముల్చాంద్ శర్మను సన్మానిస్తున్న రాజేంద్రనగర్‌కు చెందిన వాకర్స్



ధర్మగిరి సాయిబాబా ఆలయంలో అన్నదానం

మణికొండ: గురు పూర్ణమిని పురస్కరించుకుని గురువారం మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలోని ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, బీజేపీ అధ్యక్షుడు రవికాంత్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్‌లు శ్రీకాంత్‌స్వామి, వందన నగేష్, శైలజ, కాలనీ వాసులు పాల్గొన్నారు

ధర్మగిరికి పోటెత్తిన భక్తులు..

శంషాబాద్: ధర్మగిరి సాయిబాబా మందిరానికి గురువారం పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. గురుపౌర్ణమి సందర్భంగా ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో భారీ సంఖ్యలో భక్తులు పాల్గొని బాబాను దర్శించుకున్నారు. హోమం, పల్లకి సేవ, హారతి తదితర కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులకు ఆలయ ట్రస్టీ శివదత్తసాయి పర్యవేక్షణలో అన్నదానం చేపట్టారు.

యోగా గురువుకు సత్కారం..

రాజేంద్రనగర్: గురుపౌర్ణమి సందర్భంగా గురువారం ఉదయం రాజేంద్రనగర్‌కు చెందిన వాకర్స్ యోగా గురువు ముల్చాంద్ శర్మను ఘనంగా సన్మానించి గురు పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతిరోజు యూనివర్సిటీలోని గ్రంథాలయం వద్ద వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వాకర్స్‌కు శర్మ ఉచితంగా యోగా తరగతులను నిర్వహిస్తున్నారు. 12 ఏళ్లుగా శర్మ ఈ ప్రాంతంలో యోగాను ఉచితంగా నేర్పిస్తున్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదుగాలి..

ఏజీవర్సిటీ: విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదుగాలని ఉద్యాన విశ్వవిద్యాలయం అసోసియేట్ డీన్ డాక్టర్ పి.ప్రశాంత్ అన్నారు. గురువారం కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో గురు పౌర్ణమి, నాలుగో సంవత్సరం విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గురువులను సన్మానించారు. కళాశాలను వదలి వెళుతున్న విద్యార్థులకు మెమెంటో, ప్రశంసాపత్రాలను అందజేశారు.

హైదర్‌గూడలో..

అత్తాపూర్: హైదర్‌గూడ ప్రాథమిక పాఠశాల గురువులను సన్మానించే అవకాశం అదృష్టంగా భావిస్తున్నామని కార్పొరేటర్ సంగీత గౌరీశంకర్ అన్నారు. గురు పౌర్ణమి పురస్కరించుకొని తామంతా స్థానిక ప్రాథమిక పాఠశాలలో చదువుకున్న విద్యార్థులుగా ఎంతో సంతోషాన్ని కలిగిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి.శ్రీలత, ఎస్.భాస్కర్, సత్యనారాయణ, శివ, నారాయణలను రంగారెడ్డి బీజేపీ సీనియర్ నాయకులు నారెగూడెం మల్లారెడ్డి, మొండ్ర కొమురయ్య, సంగీతగౌరీశంకర్, సులిగే వెంకటేష్, విజయ్‌కుమార్, సాబాద విజయ్ కుమార్ పాల్గొన్నారు.



హైదర్‌గూడ ప్రాథమిక పాఠశాలలో..